క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ వికాస్ పరిషత్ అధ్యక్షుడు బొంజునాయుడు, సభ్యులు

పాడేరు రూరల్: ఆదివాసీ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 9న ఆదివాసీ దినోత్సవానికి ఘనంగా నిర్వహించనున్నట్లు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు అడపా బొంజునాయుడు చెప్పారు. పాడేరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ దినోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఆదిమజాతుల సమాఖ్యా జాతీయ ఉపాధ్యక్షుడు కె.విలియమ్స్, ఆదివాసీ వికాస్ పరిషత్ ప్రతినిధులు చిట్టిబాబు, నాగం నాయుడు, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కాఫీ మొక్కల పంపిణీ



రైతులకు కాఫీ మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాబూరావు

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ జంగంపుట్టు గ్రామంలో 2023–24 సంవత్సరానికి గాను ఐటీడీఏ ద్వారా అందిస్తున్న కాఫీ మొక్కలను సర్పంచ్ బాబూరావు సోమవారం గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు కాఫీ సాగు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఎకరానికి వెయ్యి కాఫీ మొక్కలు చొప్పున అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కాఫీ మొక్కలను రైతుల చేత నాటించారు. లైజన్ వర్కర్ హరికృష్ణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై అవగాహన



పసరిగిన్నిలో సేంద్రియ ఎరువుల ద్రావణాన్ని తయారుచేస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ సచివాలయం పరిధిలోని పసరిగిన్ని, పి.యర్రగొండ గ్రామాల్లో సోమవారం ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులు తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పంటకు సోకే చీడపీడల నివారణకు సేంద్రియ ద్రావణం, కషాయాలను తయారు చేశారు. ఆయా ద్రావణాలను అన్ని రకాల పంటలపై పిచికారీ చేస్తే, చీడపీడలు పూర్తిగా నివారమవుతాయని వ్యవసాయ శాఖ సిబ్బంది తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది కామేష్ , అమ్మాజీ, నారాయణమ్మ, వెంకటేశ్వర్లు, సత్యవతి, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం నేత సూర్యనారాయణకు నివాళి



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయటౌన్: స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో సీపీఎం నాయకుడు సూర్యనారాయణ వర్థంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు పొద్దు బాలదేవ్‌తో పాటు పలువురు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల సమస్యల పట్ల , న్యాయం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి సూర్యనారాయణ అని కొనియాడారు. సంతల్లో పంటలకు గిట్టుబాటు ధరల కోసం, గిరిజన రైతులకు అండగా నిలిచి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రామారావు, రామన్న, రాజు, రాంబాబు, గురుమూర్తి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లిటౌన్: ప్రతిభగల గవర, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరంలో పాలిటెక్నిక్, ఐటీఐ, ఈ క్యాట్, ఇంజినీరింగ్, మెడిసన్, బీడీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ తదితర ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఉపకార వేతనాల కోసం తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవా లని కోరారు. సెప్టెంబర్ 5లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9676392974, 9390991099
సాక్షి

ఆరోగ్య భాగ్యం

- గర్భిణులు, బాలింతలకు పోషకాహారం
- పది రకాల సరకుల రేషన్ ఇంటికే అందజేత
- గిరిజనులు, బాలింతల హర్షాతిరేకాలు



సంపూర్ణ పోషణ కిట్‌లో ఉన్న వస్తువులు



అరకులోయలో గర్భిణికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి

అరకులోయటౌన్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజల చెంతకే వైద్య సేవలందించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం కిట్‌లను అందజేస్తోంది.

గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తూ ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. వారిలో రక్తహీనత నివారణకు అన్ని చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. అందుకే సంపూర్ణ పోషకాహారాన్ని ఇంటి వద్దకే అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. పది రకాల సరకులను ప్రత్యేక సంచిలో వేసి ఆ కిట్‌ను నెలకు రెండుసార్లు ఇంటికే అందించే బృహత్తర కార్యక్రమానికి ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు.

పోషకాహారాల సరకులు

అరకులోయ నియోజకవర్గం పరిధిలోని అరకులోయ మండలంలోని 164 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,012 మంది బాలింతలు, గర్భిణులుండగా, అనంతగిరి మండలంలోని 254 కేంద్రాల్లో 912 మంది బాలింతలు, గర్భిణులు, డుంబ్రిగుడ మండలంలోని 161 కేంద్రాల్లో 907 మంది బాలింతలు, గర్భిణులున్నారు. ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో వంటనూనె, 25 గుడ్లు, 5 లీటర్లపాలు, 2 కిలోల గోధుమ పిండి, కిలో రాగి పిండి, అరకిలో ఎండు కర్జూరం, అరకిలో చొప్పున శెనగ చెక్కీలు, బెల్లం తదితర సరుకులను సమకూర్చింది.

టీడీపీ హయంలో అవస్థలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చే అరకొర సరకుల కోసం గర్భిణులు, బాలింతలు గంటల కొద్దీ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. అక్కడ వేచి ఉండలేక తీవ్ర అవస్థలు పడేవారు. నెలలు నిండిన గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. సరకుల నాణ్యత కూడ బాగుండేది కాదు. తూనికల్లో కూడ చాలా తేడా వచ్చేది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన పోషకాహారాన్ని అందజేస్తోంది. గర్భిణులు, బాలింతల ఇళ్లకే సరకుల కిట్‌లు అందేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి లబ్ధిదారులకు సరకులు తీసుకున్న ఫోటోలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పారదర్శకంగా అందరికీ పోషకాహారం నూరుశాతం అందుతుండడంతో సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

గర్భిణులు, బాలింతలకు అండగా

గర్భిణులు, బాలింతలకు సీఎం జగనన్న అండగా ఉంటున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం చాలా బాగుంది. ఇంటి వద్దకే కిట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. గర్భవతి అయిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నారు. నా ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఆరా, సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం కిట్ల రూపంలో పౌష్టికాహారం ఇవ్వడం హర్షణీయం. పౌష్టికాహారం వలన రక్తహీనత తగ్గుతోంది. సరకులు ఇంటి వద్దకే అందించడవం గొప్ప విషయం.

– జర్రా పుష్ప, గర్భిణి , బోసుబెడ గ్రామం

పారదర్శకంగా పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) కార్యక్రమాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోంది. బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని పది రకాల సరుకులతో కూడిన బ్యాగులను ఇంటి వద్దకే అర్హులైన వారికి అందజేస్తున్నాం.

– శారద, సీడీపీవో, అరకులోయ

పెట్రోల్ బంక్ తనిఖీ



డుంబ్రిగుడలో పెట్రోల్ బంక్ తనిఖీ చేస్తున్న జీసీసీ డీఎం సింహాచలం

డుంబ్రిగుడ: మండలంలోని జీసీసీ పెట్రోల్ బంక్‌ను సోమవారం పాడేరు డివిజన్ జీసీసీ డీఎం సింహాచలం సందర్శించారు. రికార్డులు, పెట్రోల్ ట్యాంక్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మరుగుదొడ్లు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కాఫీ స్టాల్‌లో ప్రజలకు ఉపయోగపడే నిత్యావసర సరకులు మంచినూనె, పంచదార, సబ్బులు, పప్పు తదితర సరకులను విక్రయించాలని సూచించారు. ఇండేన్ గ్యాస్ గోడౌన్‌ను మరమ్మతులు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జీసీసీ బ్రాంచి మేనేజర్ వెంకటేశ్వర్లు, పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి సూర్యారావు తదితరులున్నారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు

వై.రామవరం: మండలంలోని దబ్బమామిడి గ్రామానికి చెందిన కయ్యం చిన్నిబాబు(48) అనే గిరిజనుడు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ద్వారా బ్యాంకు సిబ్బంది ఇటీవల పీఎం జీవన్‌జ్యోతి బీమా పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. దీంతో ప్రభుత్వం రూ.2లక్షలను బీమా సొమ్మును మంజూరు చేసింది. విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు బ్యాంకు మేనేజర్ తెలియజేశారు. ఈ మేరకు బ్యాంకు మేనేజర్ నాగరాజు మృతుడి భార్య కయ్యం మాణిక్యాలుకు బీమా చెక్కును సోమవారం అందజేశారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. హెడ్ క్యాషియర్ దీపక్, క్యాషియర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి కృషి



కోతకు గురైన కల్వర్టును పరిశీలిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, సర్పంచ్ రాంబాబు తదితరులు

జి.మాడుగుల: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన బొంజంగి– సాడేకు గెడ్డపై పైపు కల్వర్టును సోమవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుర్లని మత్స్యకొండంనాయుడు, సర్పంచ్ కిముడు రాంబాబు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర పరిశీలించారు. కల్వర్టు కొట్టుకుపోవటం వలన గ్రామాల మధ్య వాహనరాకపోలు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని బొంజంగి గ్రామస్తులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యను పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లి కల్వర్టు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న క్రైస్తవ సంఘ సభ్యులు

వై.రామవరం: మణిపూర్ ఆదివాసీ మహిళలపై జరిగిన అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో అల్లూరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ జాయింట్ సెక్రటరీ విక్టర్ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘ నేతలు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ సోదరులకు, మత బోధకులకు, ఆదివాసీలకు రక్షణ కల్పించాలని వారు కోరారు. తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం.సంతోష్ కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు సహన్‌సాగర్, సమర్పణకుమార్, మాలతి, సాల్మన్‌రాజు, ఫిలిప్, మార్కుబాబు, గాబ్రియేల్, సాగరబాబు, ఇమ్మానియేలు, సురేష్ , పాస్టర్లు, ఆదివాసీలు పాల్గొన్నారు.

యోగాలో గురుకుల విద్యార్థి ప్రతిభ



ఆదిత్య రుత్విక్

నక్కపల్లి : ఈనెల 4, 5, 6 తేదీల్లో బీకెఎస్ అయ్యంగార్ మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలో ఉపమాక గ్రామానికి చెందిన దవరసింగి ఆదిత్య రుత్విక్ మూడోస్థానం సాధించాడు. 12 నుంచి 15 ఏళ్ల బాలుర విభాగంలో రుత్విక్ ఈ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు సోమవారం ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పుల్లేటి సతీష్ చెప్పారు. రుత్విక్ నర్సీపట్నం ఎంజేపీ ఏపీబీసీ డబ్ల్యు రెసిడెన్షియల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గురుకులం ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఉపాధ్యాయుల సూచనలతో యోగా సాధన చేస్తున్నానని, రానున్న రోజుల్లో జాతీయస్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించేందుకు మరింత కృషి చేస్తానని ఆదిత్య రుత్విక్ చెప్పాడు.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు



విలేకరులతో మాట్లాడుతున్న బుజ్జిబాబు, రామన్న

అరకులోయటౌన్: పాడేరు ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జిబాబు, రామన్న డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వసతి గృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని, సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటుచేయాలని, దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. బాలికల వసతి గృహాల్లో ప్రహరీ నిర్మించి, వాచ్‌మెన్‌లను నియమించాలన్నారు.

ఆశ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఆశ కార్యకర్తల సంఘం నాయకురాలు మంగమ్మ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్, వీఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శి శేఖర్, సీటూ నాయకుడు అప్పలకొండ, హుకుంపేట వైస్ ఎంపీపీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఉత్సవం



ఊరేగింపులో భక్తులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద వెలసిన ముత్యాలమ్మ ఉత్సవం సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మ వారి పుట్టుక ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్‌మార్ డప్పులు, కర్ర సాములతో బాణసంచా కాలుస్తూ భక్తుల పునకాలతో తాళ్లపాలెం సంతకాలనీ నుంచి భారీ ఊరేగింపుగా గంగాదేవి అమ్మ వారి ఆలయ సమీపంలో ఉన్న పుట్ట వద్దకు తరలి వెళ్లారు. అక్కడ పూజలు చేసి అమ్మ వారి ప్రతి రూపాన్ని ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయంలో నిలిపారు. విశేష పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రధానమైన అమ్మవారి ఉత్సవం రెండో రోజైన మంగళవారం ఘనంగా జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన



బొండాంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- గ్రామాల్లో గడప గడపకు విశేష ఆదరణ
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం
- సమస్యల పరిష్కారానికి హామీ

అరకులోయటౌన్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని బొండాం పంచాయతీ కేంద్రంతో పాటు నిన్నిమామిడివలస, రేగ, మజ్జివలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 363 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఆయనకు గ్రామస్తులు గిరిజన సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే పాల్గుణ ఆయా గ్రామాల్లో స్థానికులను ఆప్యాయంగా పలకరించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సమస్యల పరిష్కారానికి వేదికగా మారిందన్నారు. గర్భిణులు, బాలింతల ఇంటికే వైఎస్సార్ పోషణ కిట్లు అందజేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలందుతున్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొండాం గ్రామంలో రైల్వే అండర్ బ్రిడ్జి, సీసీ రోడ్లు కోసం పలువురు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌లు దురియా భాస్కర్‌రావు, రాధిక, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాజారమేష్, ఎంపీటీసీ ఎల్.బి..భీమరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి, వైస్ ఎంపీపీ రామన్న, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, జిల్లా యువజన విభాగ మండల అధ్యక్షుడు కిరణ్, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, మండల పార్టీ కన్వీనర్ పట్టాసి సంపత్, మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకటరావు, నాయకులు గోపాల్, సాంబ, గురు, తిరుపతి, అప్పలస్వామి, బాలరాజు, రామ్మూర్తి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సుజనకోటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో సోమవారం కిలగాడ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు వైద్య సేవలందించారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 92 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు ఉచితంగా అందజేసినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి కె.సుబ్రహ్మణ్యం చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని, అనారోగ్యమైతే తక్షణమే వైద్యం పొందించాలని సూచించారు. హైల్ అసిస్టెంట్ అశోక్, సిబ్బంది లలిత, పుణ్యవతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది

చింతపల్లిరూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని సీడీపీవో రామలక్ష్మి అన్నారు. మండలంలో చింతపల్లి-1, చింతపల్లి-2 సబ్ సెంటర్‌లలో సోమవారం నిర్వహించిన తల్లిపాలు వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట వ్యవధిలో తల్లులు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 5 సంవత్సరాల వరకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు విజయ, ఉన్నిసాబేగం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



నేరేడివలసలో గర్భిణులకు పోషకాహారం కిట్‌లను అందజేస్తున్న సర్పంచ్ రామ్మూర్తి

డుంబ్రిగుడ: ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అమలుచేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలని కొల్లాపుట్టు పంచాయతీ సర్పంచ్ రామ్మూర్తి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు , చిన్నారులకు రక్తహీనత నివారణ లక్ష్యంగా ప్రభుత్వం మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి చేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్

అనంతగిరి: అన్నమ్మయ్య జిల్లా పుంగనూరులోని పోలీసులపై దాడి చేసిన టీడీపీ నాయకులపై వెంటనే చర్యలు చేపట్టాలని, ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం వైఎస్సార్‌సీపీనాయకులతో కలిసి దాడిని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులపై టీడీపీ నాయకులు రాళ్ల దాడి చేయడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు సీతయ్య, పెంటమ్మ, గణేష్, రాములమ్మ, నాయకులు సత్యనారాయణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న డీ వార్మింగ్ మందు పంపిణీ

పెదబయలు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం మూడు పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10న నిర్వహించనున్న నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు వారికి డీ వర్మింగ్ మందు పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, ఆస్పత్రుల్లో మందును మింగించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సింధూరం పడాల్, డాక్టర్ అఖిల్, డాక్టర్ చంద్రశేఖర్, ఎంఈవో కె.కృష్ణమూర్తి, జి.పుష్పవతి, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, సీడీపీవో రాజేశ్వరి, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కశింకోట: మండలంలోని ఏఎస్ పేటలో మరిడిమాంబ అమ్మ వారి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com